

అనకాపల్లి టు గాజువాక

- సమన్వయకర్తగానే బాధ్యత అప్పగింత
- అభ్యర్థిగా ఇవ్వని స్పష్టత
- మంత్రి అమర్‌నాథ్‌కు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా 15 నియోజకవర్గాల వైసిపి అభ్యర్థుల విజయం కోసం అవసరమైతే, వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటాను. నా తలరాత జగన్మోహన్‌రెడ్డి రాస్తారు' అని ఈ నెల ఏడున అనకాపల్లి మండలం పిసినికాడ చేయూత సభలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నమాటలివి...

'రాబోయే రోజుల్లో అమర్‌కు మంచి చేస్తాను. ఎన్నికల్లో మలసాల భరత్‌కుమార్‌ను ఆశీర్వదించండి'. ఇదే సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాఖ్యలు...

రానున్న ఎన్నికల్లో అమర్‌కు టిక్కెట్ వచ్చే అవకాశంలేదని మంత్రి అమర్‌నాథ్, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాటలతో తేటతెల్లమైంది. అంతకు కొద్ది రోజుల ముందు వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ సమన్వయకర్తలు అభ్యర్థులు కారని, అభ్యర్థులుగా పార్టీ ప్రకటించేవరకు సమన్వయకర్తలగానే పనిచేయాలని అన్నారు. మంగళవారం రాత్రి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి అమర్‌ను వైసిపి నియమించింది. నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతల నుంచి ఉరుకూటి రామచంద్రరావును తప్పించి అమర్‌కు ఆ బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. అనకాపల్లి నుంచి గెలిచే అవకాశంలేదని అమర్‌ను తప్పించి భరత్‌ను సమన్వయకర్తగా నియమించి అభ్యర్థిగా ప్రకటించింది. అనకాపల్లి టిక్కెట్ అమర్‌కు ఇవ్వకపోవడమే గాక, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని నగర, గ్రామీణ ప్రాంతంలోని 13 నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీచేసినా అమర్ గెలవరని వైసిపి అధిష్టానం నిర్ధారణకు వచ్చింది. ఆ నిర్ధారణతోనే తన బంధుగణం, పరిచయాలు, సామాజిక తరగతి కాస్త ఎక్కువగావున్న గాజువాక, పెందుర్తి, యలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో ఏదో ఒక నియోజకవర్గ నుంచి పోటీచేసే అవకాశం కల్పించాలని ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని అమర్ కోరినా, ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు ప్రచారం జరిగింది.

టిక్కెట్ ఇవ్వకపోయినా, పార్టీ గౌరవించిందన్న అభిప్రాయం కల్గించేందుకు వైవి సుబ్బారెడ్డి ఆధిపత్యం దెబ్బతినకుండా ఉమ్మడి జిల్లా డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా అమర్‌ను నియమించింది. ఎటువైపు నుంచి చూసినా సరైన స్థానం దక్కకపోయినప్పటికీ, జగన్మోహన్‌రెడ్డికి విధేయునిగానే మెలుగుతూవచ్చారు. తాజాగా గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా అమర్‌కు బాధ్యతలు అప్పగించినప్పటికీ, అభ్యర్థిగా బరిలో నిలిపే విషయమై వైసిపి తర్జనభర్జనలు పడుతోంది. బిజెపి, జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిని ప్రకటించిన తరువాత సామాజిక తరగతి, స్థానిక బలాబలాలు, పార్టీలో నియోజకవర్గ స్థాయి నాయకుల సహకారం, ఆర్థిక పరిస్థితిని ఆధారంగా అమర్ విషయమై స్పష్టతకు వైసిపి రానుంది. అంతవరకు ఆ పార్టీలో గందరగోళం తప్పేలాలేదు. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా భరత్‌కుమార్‌ను నియమించిన తరువాత, భరత్ కంటే అమర్‌ను కొనసాగించడమే మంచిదన్న మైండ్ గేమ్ కొంతకాలం నడిచింది. పిసినికాడ సభలో సిఎం ప్రకటనతో స్పష్టత వచ్చింది. గాజువాక నియోజకవర్గం వైసిపి అభ్యర్థి విషయమై స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టనుంది.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

ఇఎస్ఎంఎస్ శిక్షణలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున



ఇఎస్ఎంఎస్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటిస్తూ జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్)పై శిక్షణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బుధవారం విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైనా వచ్చే అవకాశముందని, నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఎంసిసి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వస్తుందని తెలిపారు. ఇందుకు తగిన విధంగా నోడల్ అధికారులు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో వచ్చిన నుంచి నగదు, బంగారు ఆభరణాలు వంటివి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అవకాశం ఉందని, ఇందుకు ఎయిర్ పోర్ట్, రైల్వే స్టేషన్లు, అంతర్ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో గట్టి నిఘాను ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలు వంటివి జిల్లాలోకి ప్రవేశించకుండా తగిన బందోబస్తు ఏర్పాటుచేయాలని చెప్పారు. ఎస్ఇబి, పోలీస్, అటవీ, ఎక్సైజ్, నార్కోటిక్, ఇతర శాఖల నోడల్ అధికారులు జాయింట్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

ఎన్నికల కోడ్ వచ్చిన నుంచి ఎక్కడైనా అక్రమంగా నగదు, వస్తువులు రవాణా, పంపిణీ చేస్తున్నప్పుడు పట్టుబడిన వివరాలను వెంటనే ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ సిస్టం (ఈఎస్ఎంఎస్) యాప్‌లో నమోదు చేయాలన్నారు. రూ.10 లక్షలకు నగదు పట్టుకున్న పక్షంలో ఆదాయపు పన్ను అధికారి తెలియజేసి, సీజ్ చేయించాలన్నారు. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తుంటే పట్టుకోవాలని, రూ.10 వేల విలువ చేసే బహుమతులు, వివిధ రకాల వస్తువులు ఉంటే సీజ్ చేయాలన్నారు. రూ.1 లక్షకు మించి బ్యాంకు నుంచి నగదు తీసుకున్నా, ఒక బ్యాంకు ఖాతా నుండి అధిక సంఖ్యలో బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ జరిగినా వాటి వివరాలను పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ నోడల్ అధికారులకు ఇఎస్ఎంఎస్ యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఒ కె.మోహన్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు, ఎస్ఇబి, పోలీస్, అటవీ, ఎక్సైజ్, పోస్టల్, ఆదాయపన్ను, ఎయిర్ పోర్ట్, సిఆర్ పిఎఫ్, జిఎస్‌టి, రెవెన్యూ, ఇంటిలిజెన్సీ అధికారులు పాల్గొన్నారు.

తేనె కొనుగోలు ధరను పెంచిన జిసిసి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి కాలనీ : గిరిజన సహకార సంస్థ గిరిజనుల నుంచి సేకరిస్తున్న తేనె కొనుగోలు ధరను కిలో ఒక్కింటికి రూ.200 నుంచి రూ.250కు పెంచినట్లుగా సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. తేనెను సేకరించేటప్పుడు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఎఐ ప్రమాణాలను పాటించాలని కొనుగోలు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తేనె సేకరించు గిరిజనులకు గుర్తింపు కార్డులు అందజేయాలని నిర్ణయించి నట్లు, గిరిజనుల నుంచి సేకరించు తేనెకు చెల్లించే సొమ్మును వారి ఖాతాలలో నేరుగా జమ చేయుటకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, తిరుపతి, శ్రీశైలం డివిజన్లలో తేనె అధిక మొత్తంలో లభ్యమవుతుందని తెలిపారు. సేకరించిన తేనెను రాజమండ్రి, చిత్తూరులో గల తేనె శుద్ధి కర్మాగారములో శుభ్రపరచి విక్రయాలకు సంసిద్ధం చేస్తున్నట్లు వివరించారు. గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయడలచినవారు www.apgirijanonline.com వెబ్ సైట్ ద్వారా కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

వాల్తేర్ డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది 08571 విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ ప్రత్యేక రైలు ఈ నెల 23, 30 తేదీల్లో ఉదయం 8.20 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి మరుసటి రోజు 17.40 గంటలకు హజరత్ నిజాముద్దీన్ చేరుకుంటుంది. 08572 హజరత్ నిజాముద్దీన్-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 24, 31 తేదీల్లో రాత్రి 23.35 గంటలకు హజరత్ నిజాముద్దీన్ నుంచి బయలుదేరి మూడవ రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08517 విశాఖపట్నం-పాట్నా హోలీ ప్రత్యేక రైలు ఈ నెల 20, 27 తేదీల్లో ఉదయం 9.25 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.35 గంటలకు పాట్నా చేరుకుంటుంది. 08518 పాట్నా - విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 21, 28 తేదీల్లో మధ్యాహ్నం 13.00 గంటలకు పాట్నా నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 14.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

07223 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి హోలీ స్పెషల్ రైలు ఈ నెల 22 ఉదయం 7.05 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి సాయంత్రం 19:55 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 10:30 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 07224 సంత్రాగచ్చి - సికింద్రాబాద్ ప్రత్యేక ఈ నెల 23 మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారు జామున 02:03 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అదే రోజు మధ్యాహ్నం 14.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

07225 సికింద్రాబాద్ - షాలిమార్ హోలీ ప్రత్యేక రైలు ఈ నెల 25 ఉదయం 4.30 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 14:30 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 06.05 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. 07226 షాలిమార్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 26 ఉదయం 10.00 గంటలకు షాలిమార్ నుంచి బయలుదేరి మరుచటి రోజు అర్ధరాత్రి 1:25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అదేరోజు మధ్యాహ్నం 13.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

విశాఖ మీదుగా అన్ రిజర్వ్డ్ ప్రత్యేక రైళ్లు

06077 చెన్నై ఎగ్మోర్ - సంత్రాగచ్చి అన్ రిజర్వ్డ్ స్పెషల్ రైలు ఈ నెల 16, 23, 30, ఏప్రిల్ 6 తేదీల్లో రాత్రి 23.00 గంటలకు చెన్నై ఎగ్మోర్ నుంచి బయలుదేరి మరుచటి రోజు మధ్యాహ్నం 13:54 గంటలు దువ్వాడ చేరుకుంటుంది. ఆ మరుచటి రోజు 7.15 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 06078 సంత్రాగచ్చి - చెన్నై ఎగ్మోర్ అన్ రిజర్వ్డ్ ప్రత్యేక రైలు ఈ నెల 18, 25, ఏప్రిల్ 1, 6 తేదీల్లో ఉదయం 10:00 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుచటి రోజు అర్ధరాత్రి 1:48 గంటలకు దువ్వాడ, అదేరోజు మధ్యాహ్నం 15.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది.

చెన్నై ఎగ్మోర్ - సంత్రాగచ్చి రిజర్వు ప్రత్యేక రైలు ఈ నెల 19, 26, ఏప్రిల్ 2 తేదీల్లో మధ్యాహ్నం 13.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ నుంచి బయలుదేరి మరుచటి రోజు తెల్లవారుజామున 2:30 గంటలకు దువ్వాడ, రాత్రి 21.00 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 06080 సంత్రాగచ్చి - చెన్నై ఎగ్మోర్ రిజర్వు ప్రత్యేక రైలు ఈ నెల 20, 27, ఏప్రిల్ 3 తేదీల్లో రాత్రి 23.40 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుచటి రోజు సాయంత్రం 16:55 గంటలకు దువ్వాడ, ఆ మరుచటి రోజు ఉదయం 9.00 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది.



గాంధీగ్రాం సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

హౌసింగ్ బిల్లులు ఇవ్వాలని బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం : సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల తమకు హౌసింగ్ బిల్లులు అందలేదని మండలంలో గాంధీగాం గ్రామానికి చెందిన మహిళలు బుధవారం సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు ఐతే శివలక్ష్మి, గండేపల్లి అప్పలనరస, కలగాన లక్ష్మి, అడ్డూరి చిలకమ్మ, చెక్క అప్పల నరస, షేక్ మున్ని, అనపర్తి వరలక్ష్మి, పెనగంటి గంగాభవాని తదితరులు మాట్లాడారు. నర్సాపేట రెవెన్యూ పరిధిలో జగనన్న కాలనీలో తాము ఇళ్ల నిర్మాణం చేపట్టి దాదాపు రెండు నెలలు పూర్తయిందని చెప్పారు. అయితే గాంధీ గ్రాం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమారు నెల రోజుల నుండి సచివాలయానికి రాలేదని, దీంతో బిల్లులు అందని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వెంటనే తమకు బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ గాడి అప్పారావు మాట్లాడుతూ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ విధులకు గైర్హాజరు వల్ల సచివాలయ ఉద్యోగులకు జీతాలు రాలేదని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని అప్పారావు తెలిపారు.

పర్యవేక్షణ లేకే పేరుకుపోతున్న చెత్త

ప్రజాశక్తి - యలమంచిలి : పట్టణంలో ఎక్కడ చూసినా అపారిశుధ్యం తాండవిస్తోందని, వందమంది కార్మికులున్న పట్టణాన్ని సుందరంగా ఉంచలేకపోతున్నారని, పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి శానిటరీ విభాగంపై విమర్శలు గుప్పించారు. యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రమాకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీగా ఉన్న నాటి కంటే పారిశుధ్యం నిర్వహణ దిగజారిందన్నారు. విలీన గ్రామాల్లో సరైన డాక్యుమెంట్లు లేక ఇంటి పన్నులు చెల్లించని వారికి అసెస్‌మెంటు నెంబరు కేటాయించలేకపోతున్నామని సభ్యులు తెలపగా, ఇంటి యాజమాన్య హక్కులు లేనివారు సెల్ఫ్ డిక్లరేషన్‌తో నోటరీ చేయించి, ఫ్యామిలీ సర్టిఫికెట్ సమర్పించాలని విద్యుత్ శాఖ సూచించింది. డ్రైనేజి మెరుగునకు వాహనం, రామారాయుడు పాలెం ఎస్సీ కాలనీ రోడ్డు నిర్మాణం, మంత్రి పాలెంలో పాల కేంద్రానికి భూమి కేటాయింపు, రోజువారీ వారపు సంత, పశువుల మార్కెట్, మేకల కమేళ లీజు మొదలైన అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. కార్యక్రమంలో కమిషనర్ కొండలరావు, వైస్ చైర్మన్లు ఆరెపు గుప్తా, కౌన్సిలర్లు దాసరి కుమార్, అచ్యుతరావు, ఇతర కౌన్సిలర్లు, పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమా కుమారి

సింబయో జెనరిక్స్‌లో ప్రమాదం

హాట్ వాటర్ లీకై నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రాంబిల్లి

అచ్యుతాపురం ఎస్ఇజెడ్, రాంబిల్లి మండలం లాలం కోడూరు శివారులో ఉన్న సింబయో జెనరిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. కంపెనీలో ఏ షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు బాయిలర్ షట్ డౌన్ చేస్తుండగా, హాట్ వాటర్ లీకై ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చోడవరం మండలం పెద్ద గోవాడ గ్రామానికి చెందిన ఎ.రాము, రాంబిల్లి మండలం పెదకళలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి, ఎ.సన్యాసిరావు, మర్రిపాలెం గ్రామానికి చెందిన కె సన్యాసిరావు, కె.రమణ నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను విశాఖపట్నం కేర్ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు

సింబయో జనరిక్స్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడు నాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రమాద ఘటన స్థలాన్ని బుధవారం వారు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో నిత్యం ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, కార్మిక శాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం దారుణమన్నారు. కార్మికుల ప్రాణాలంటే లెక్క లేదని, కంపెనీ యాజమాన్యాలు లాభమే పరమావధిగా దోచుకొని కార్మికులకు రక్షణ లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారి యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.



సింబయో కంపెనీ ఎదుట మాట్లాడుతున్న సిఐటియు నేత దేముడునాయుడు

ఎన్నికల విధి విధానాలపై త్వరలో వర్క్‌షాప్

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎన్నికల విధివిధానాలపై త్వరలో వర్క్ షాప్ ఏర్పాటు చేస్తామనీ జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రీ పోల్ కార్యక్రమాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ లిస్ట్‌పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే నోటిఫికేషన్ ముందే తమకు అందజేయాలని, నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అభ్యంతరాలు స్వీకరించబడవని తెలిపారు. నూతన ఓట్లు నమోదుపై ఎన్నికల గడువు పదిహేను రోజుల వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బొలిశెట్టి శ్రీనివాసరావు (టిడిపి), వివి.శ్రీనివాసరావు (సిపిఎం), బిజెపి, కాంగ్రెస్, ప్రతినిధులు, ఎన్నికల సూపరింటెండెంట్ మూర్తి, పౌరసరాపరాల అధికారి సాయిబాబా, సమావేశాల నిర్వాహకులు తులసీరామ్ పాల్గొన్నారు.



వివిధ పార్టీ ప్రతినిధులంతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి అన్నారు. ఈ మేరకు సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతితో కలిసి బుధవారం ప్రభావతి స్థానిక తహసీల్దారు జె.చలమయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్లు 103, 106 లలో సుమారు మూడు ఎకరాల గెడ్డవాగును ఓ రియల్టర్ ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకుని, భూ కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు



రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం నేత సదాశివరావు

నేటి కార్మిక, కర్షక నిరసనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి, ఈ నెల 14న జరుగు చలో ఢిల్లీ కార్యక్రమానికి సంఘీభావంగా గురువారం గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో జరుగు నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కార్మికులు, కర్షకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలో జగ్గన్నపేట గ్రామంలో బుధవారం కర్రి అప్పారావు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.రామ సదాశివరావు రైతులతో సమావేశమై మాట్లాడారు. బిజెపి తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో 15 నెలలపాటు రైతులు చేసిన ఉద్యమానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తలొగ్గి, రైతాంగానికి ప్రధాని మోడీ క్షమాపణ చెప్పి రాతపూర్వకంగా కొన్ని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కాని వాటిని నేటికీ నెరవేరకపోవడంతో దేశవ్యాప్తంగా 540 రైతు సంఘాలతో ఢిల్లీ రామ్ లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ రైతు ఉద్యమానికి సంఘీభావం తెలపవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. గురువారం ఉదయం తిమ్మరాజుపేట జంక్షన్లో జరుగు మానవహారంలో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు మల్ల బుజ్జి, దొడ్డి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : 14 న చలో ఢిల్లీకి సంఘీభావంగా మండల కేంద్రంలో చేపట్టిన ఆందోళనలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు ఎస్.బ్రహ్మాజీ, వి వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మునగపాక, వాడ్రాపల్లి, ఆనందపురం, తిమ్మరాజుపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి ప్రచార సభలు నిర్వహించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయపేట మండలం వడ్డాది జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను జెడ్‌పిటిసి సభ్యులు దొండా రాంబాబు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొండా నారాయణమూర్తి, పినపోలు రామునాయుడు, బాషా, గాంధీ, కోవెల ఈశ్వరరావు, పాఠశాల హెచ్ఎం పివి.శేషు బాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు తదితరులు

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన


సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్‌ను ఇస్తున్న శ్రీ భరత్

ప్రజాశక్తి- తగరపువలస :రానున్న ఎన్నికల్లో విశాఖ ఎంపిగా తనను గెలిపించాలని కోరుతూ టిడిపి ఎంపీ టికెట్ ఆశిస్తున్న ఎం.శ్రీ భరత్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తాళ్ళ వలసలో పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైసిపి అరాచక పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలగాలంటే టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఇంటింటికి వెళ్లిసూపర్ సిక్స్ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మండల అధ్యక్షులు డిఎన్ రాజు, మాజీ ఎంపిపి, యరబాల కృష్ణవేణి, ఎంపిటిసి కోరాడ రమణ, సరగడ అప్పారావు, పతివాడ రాంబాబు, మొల్లి లక్ష్మణరావు , యరబాల అనిల్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

ప్రజాశక్తి -గాజువాక: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు, ఇతర సౌకర్యాలను కల్పించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. బుధవారం 74వ వార్డులో స్థానిక కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. దయాల్‌నగర్‌లో రూ.పది పడకలతో నిర్మించిన యుపిహెచ్‌సిని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సిద్దేశ్వరం నుంచి వుడా కాలనీని కలిపేలా రూ.ఆరుకోట్లతో నిర్మించిన డబుల్‌రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత పాల్గొన్నారు.

పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు జిసిసి లేఅవుట్ సమీపంలో రూ.కోటితో సిసి రోడ్లు, కాలువల నిర్మాణం, పార్కులు అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు .కార్యక్రమంలో ఎఇఇ సురేష్, వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పోతిన యల్లాజి, శియ్యాది కనకరాజు, పిల్లా రమణబాబు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, రాయిన సాయి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు శాంతినగర్, కస్తూరినగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లో రూ.6.05కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. శాంతినగర్‌లో శిథిలావస్థకు చేరిన కమిటీ హాల్‌ను రూ.1.98కోట్లతో పునర్నిర్మించనున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్ల పాలనను పూర్తి చేసుకోనున్న సిఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై పార్టీ కార్యాలయంలో కెకె.రాజు సమీక్షించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. ఆయా కార్యక్రమాల్లో బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, చల్లా రజిని,ఈశ్వరరావు, కంటిపాము కామేశ్వరి, కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కెవిఎన్ శశికళ, సేనాపతి అప్పారావు, నీలి రవి,పీలా వెంకటలక్ష్మీ, బి గోవింద్, కె.చిన్న, ఎస్.కృష్ణ, దూది నర్సింగరావు, జి.అప్పారావు, ఎస్.రామారావు, కె.రామారావు, కె.ఈశ్వరరావు, కె.లావణ్య, నారాయణరెడ్డి, అప్పలరెడ్డి, బొట్ట రాజు, కోదండ, దేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బంటుపల్లి పంచాయతీలో బంటుపల్లి కాలనీ నుంచి చందకవారి కల్లాల వరకు రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ కోన పైడిరాజు శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.4లక్షల జెడ్‌పి నిధులు, రూ.రెండేసి లక్షలు మండల పరిషత్, పంచాయతీ నిధుల భాగస్వామ్యంతో మొత్తంగా రూ.8లక్షలతో 800 మీటర్ల రోడ్డును నిర్మించనున్నారు..మూడు రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఇంజనీర్ అసిస్టెంట్ మోహన్ తెలిపారు. సచివాలయ కన్వీనర్ కోరాడ అచ్యుత రాంబాబు,కోన అప్పలరాజు, శ్రీను,శివ, సత్యనారాయణ, నర్సింగ్ పాల్గొన్నారు.

16న స్టీల్‌ప్లాంట్ డిక్లరేషన్ బహిరంగ సభ


మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 16న ఉక్కునగరం త్రిష్ణ గ్రౌండ్స్‌లో జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే స్టీల్‌ప్లాంట్ డిక్లరేషన్ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిడబ్ల్యుసి మెంబర్ గిడుగు రుద్రరాజు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం ఉక్కు గరంలోని ఎఐటియుసి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎందరో త్యాగాలకు ప్రతిరూపమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాలని అందరి లక్ష్యమన్నారు. ఎఐసిసి వర్కింగ్‌ప్రెసిడెంట్ పి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, మేనిఫెస్టో కమిటీ సభ్యులు పల్లం రాజు, రఘువీరారెడ్డి, జెడి శీలం వంటి జాతీయ నాయకులు సభలో పాల్గొని స్టీల్‌ప్లాంట్‌పై కాంగ్రెస్ వైఖరి స్పష్టం చేస్తారన్నారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. సిని డైరెక్టర్ పి సత్యారెడ్డి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డి ఆదినారాయణ, నీరుకొండ రామచంద్ర రావు, జె.అయోధ్యరామ్, గణపతి రెడ్డి ప్రసాదరెడ్డి, జెర్రిపోతుల ముత్యాలు, కెఎస్ఎన్ రావు, దొమ్మేటి అప్పారావు, వరసాల శ్రీనివాస్, డి సురేష్ బాబు, విళ్ళ రామ్మోహన్ కుమార్, దాలి నాయుడు, మహాలక్ష్మి నాయుడు, దేవర్, కరణం సత్యారావు, డివి రమణారెడ్డి, వి ప్రసాద్, వరదామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌కు ఘనస్వాగతం


ఎయిర్‌పోర్ట్ నుంచి ర్యాలీగా మింది వస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి -గాజువాక: గాజువాక నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా నియమితులై తొలిసారిగా విశాఖపట్నం వచ్చిన రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విశాఖ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది. అనకాపల్లి, గాజువాక, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి అమర్‌ను పూలదండలతో సత్కరించి స్వాగతం పలికారు. 68వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి గుడివాడ లతీష్ నేతృత్వంలో ఎయిర్ పోర్ట్ నుంచి మింది వరకు ఊరేగింపు నిర్వహించారు. మింది ప్రజలు అమర్నాథ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాజువాకలో తిప్పల నాగిరెడ్డి, ఉరుకూటి చందు, ఇతర పార్టీ నేతలు, సీనియర్లందరినీ గౌరవిస్తూ, అందరి సహకారం, సమన్వయంతో ఎన్నికలకు వెళతానన్నారు.. తనకు ఎవరితోనూ ఎటువంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వైసిపి వ్యతిరేకం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వైసిపి పూర్తి వ్యతిరేకమని, దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విలేకరుల ప్రశ్నకు సమాధానం చెబుతూ స్టీల్‌ప్లాంట్ అంశాన్ని వైసిపి మీద నెట్టి రాజకీయ లబ్ధి పొందాలని విపక్షాలు చూశాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్న బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేన ఇపుడు సమాధానం చెప్పాలన్నారు.కార్యక్రమంలో ఎరుబండి సత్యనారాయణ గొల్లవిల్లి శ్రీనివాసరావు, బోని శివరామకృష్ణ,అడ్డాల కృపాజ్యోతి పాల్గొన్నారు.

ఆరోగ్య పోషణపై శిక్షణ

ప్రజాశక్తి- పద్మనాభం : మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయంలో గ్రామైక్య సంఘాల కార్యకర్తలకు, ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యులకు ఆరోగ్యపోషణపై రెండు రోజులు శిక్షణనిస్తున్నట్లు ఎంపిడిఒ వి.ప్రభాకర్ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఆర్‌డిఎ పిడి ఎం.శోభారాణి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్యసంరక్షణ, గర్భిణులు,బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాక్సినేషన్, పౌష్టికాహారం, తదితర అంశాలపై వివరించారు. కిశోరబాలికలతో సంఘాలను ఏర్పాటుచేయాలని సూచించారు. శుచిశుభ్రతపై అవగాహన కల్పించారు.

అంగన్వాడీల సేవలను వివరించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెరటికోళ్ల పెంపకం, కిచెన్ గార్డెన్ ఏర్పాటుపై మహిళను చైతన్యపరచాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించే పథకాలను అందరూ అందిపుచ్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్లు రేణుకాశ్రీ, గౌరి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్యోగార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు వివిధ పోటీ పరీక్షల పాఠ్యాంశాలతో క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయం సహ కార్యదర్శి డాక్టర్ డివి.సూర్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 60మంది అభ్యర్థులు ఏడు బృందాలుగా పాల్గొనగా, విజేతలకు పుస్తకాలను బహూకరించారు. గ్రంథాలయం సిబ్బంది దుర్గారాణి పర్యవేక్షించారు

ఎకెసి కాలనీలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 40వ వార్డులో పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ తన సతీమణి చిన్ని, సోదరి ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పీలా రమాకుమారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు అంతకుముందు జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా తనకు ఒక్క ఛాన్స్ ఇచ్చి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు, స్థానిక నేతలు ఆనందకుమార్‌కు నిరాజనం పలికారు. పెద్దఎత్తున వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి.

కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అనంత వరం, గొల్లలపాలెం, పెంట, పాతకోవాడ, కొత్తకోవాడ, గంధవరం, మద్ది, బాంధవ పురం, విలాస్‌ఖాన్‌పాలెం, రెడ్డిపల్లి, కోరాడ, బుడ్డ వలస, లింగన్నపేట, గద్దపేట, బి ఆర్ తాళ్ళవలస, అయినాడ తదితర గ్రామాల్లో బుధవారం పద్మనాభం సిఐ సిహెచ్ శ్రీధర్. ఎస్ఐ జె సురేష్. ఆధ్వర్యంలో సిఐఎస్ఎఫ్, కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. వచ్చే ఎన్నికలను శాంతియుత నిర్వహణకు భరోసా కల్పిస్తూ కవాతు చేపట్టాయి.

'సినర్జీస్'లో ముగిసిన భద్రతా వారోత్సవాలు



వారోత్సవాలలో మాట్లాడుతున్న అధికారి

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ విఎస్ఇజెడ్‌లో సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్‌లో 53వ జాతీయ భద్రత వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి సురేష్ మాట్లాడుతూ పరిశ్రమలలో భద్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని, విస్మరిస్తే ముప్పు తప్పదని హెచ్చరించారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.సుధాకర్ మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి కారణమౌతుందని, కార్మికులు భద్రతా నియమాలు పాటించాలన్నారు. సినర్జీస్ సంస్థ జిఎం (ప్రాజెక్ట్స్) రమేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో ఏమరిపాటు పనికిరాదన్నారు.ఈ సందర్భంగా కంపెనీ ఉద్యోగులకు భద్రతకు సంబంధించి స్లోగన్స్, వ్యాసరచన పోస్టర్స్, క్విజ్‌లాంటి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.భద్రతావిధానాలు పాటిస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు. చిన ముసిడివాడ మెయిన్‌రోడ్డును అనుకుని అన్ని అనుమతులతో నిర్మిస్తున్న భవనాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు పాక్షికంగా తొలగించడంపై టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు మండిపడ్డారు. బుధవారం సంఘటనా స్థలానికి చేరుకుని గృహ యజమానితో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టౌన్‌ప్లానింగ్‌తో సహా అన్ని అనుమతులు తీసుకుని నిర్మిస్తున్న భవనాన్ని ఎమ్మెల్యే ఒత్తిళ్లకు తలొగ్గి పాక్షికంగా తొలగించడం దుర్మార్గమన్నారు. నియోజకవర్గంలో అడుగుకొక్కటి చొప్పున అనధికార నిర్మాణాలను వైసిపి నేతలు చేపడుతున్నారని, దీనిపై ఫిర్యాదు చేయడంతోపాటు, ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని అధికారులు, ఇలా అన్ని సక్రమంగా ఉన్నవాటిని కూల్చేయడం సరికాదన్నారు. ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగి పనులు చేస్తున్న అధికారులు దీనికి సమాధానం చెప్పాల్సిన రోజు త్వరలో వస్తుందని హెచ్చరించారు. బాధితులకు టిడిపి, జనసేన, బిజెపి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్ నాయుడు, రమేష్, గొర్లె రామకృష్ణ పాల్గొన్నారు

భాస్కర్ విద్యానికేతన్‌లో 'అమ్మకు వందనం'

ప్రజాశక్తి -గాజువాక : చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ స్కూల్‌లో బుధవారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ పాలవలస భాస్కరరావు ఆధ్వర్యంలో 4,5 తరగతులు విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి పాదపూజ చేశారు. ఈసందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పెద్దల పట్ల భక్తిభావం పెంపొందిండచం, తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం, క్రమశిక్షణతో విద్యాబోధన వంటి నైతిక విలువలను నేర్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులపై విద్యార్థులు ఆలపించిన గేయాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ాార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ రమాదేవి, ఉపాధ్యాయులు గౌతమి, ప్రణీత, అమరావతి, సునీత పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు రవాణా ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి -సీతమ్మధార: కేంద్రానికి సకాలంలో చేరుకోలేక టెన్త్ పబ్లిక్ పరీక్షను ఏ ఒక్క విద్యార్థి రాయలేదన్న ఆరోపణలు రాకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. ఈ నెల 18 నుంచి 30 వరకు పదోతరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విశాఖ జిల్లాలో రవాణా, ఇతర ఏర్పాట్లపై బుధవారం ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ కార్యాలయంలో విద్య, ఆర్‌టిసి, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాలకు ఆర్‌టిసి బస్ సౌకర్యం కల్పనపై ఆరా తీశారు. మారుమూల ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు చేసిన ఏర్పాట్లపై ప్రశ్నించారు ప్రభుత్వ ఆదేశాల మేరకు హాల్‌టిక్కెట్‌ను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులను ఉచితంగా పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లి తెచ్చేలా కండక్టర్లకు ఆదేశాలివ్వాలని సూచించారు. రేవిడి, విజయానందపురం, చిప్పాడ, తాటితూరు, అనంతవరం, కొవ్వాడ వంటి మారుమూల ప్రాంతాల విద్యార్థులకు పూర్తి సామర్థ్యంతో కూడిన బస్‌లు ఏర్పాటు చేయాలన్నారు జిల్లా ఉప విద్యాశాఖాధికారి గౌరీ శంకర్, ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ ఎ.అప్పలరాజు, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, పిఒఐసి రమేష్, జిసిడిఒ రమణ కుమారి, ఆర్‌టిసి అధికారులు జె.తిరుపతి,జి.శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు నేత దేముడునాయుడు

సిఐటియు నేతల నిరసన

ప్రజాశక్తి - చీడికాడ: బిజెపి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని చీడికాడలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలపై రైతాంగం పోరాటానికి తలొగ్గిన ప్రధాని మోడీ వాటిని రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. సోమనాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి, రైతుల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇచ్చి, ఉపాధి హామీలో రెండు వందల రోజులు పని దినాలను కల్పించి, రోజుకి 600 వేతనం ఇవ్వాలన్నారు.ప్రతి వ్యవసాయ కార్మికులకు 60 సంవత్సరాలు నిండిన వారికి రూ.6000 పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డకాయల వెంకటరమణ, గండి నారాయణమూర్తి, దేవుళ్ళు, దేవుడమ్మ, నూక రత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగులలో ఈనెల 14న గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు పార్థసారథి గుడి వద్ద టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి సమావేశం నిర్వహిస్తామని టిడిపి మండల జనరల్ సెక్రటరీ ఉండూరు దేవుడు తెలిపారు. ఈ సమావేశం మండల పార్టీ ఆధ్వర్యంలో అద్దిపల్లి జగ్గారావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రీడా మైదానం అభివృద్ధికి శ్రీకారం


ప్రజాశక్తి -కొత్తకోట:వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి కృషి ఫలితంగా కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధి పనులను బుధవారం గ్రామ సర్పంచ్ కొన లోవరాజు తదితరులు ప్రారంభించారు. ఇటీవల చోడవరం నియో జకవర్గం సామాజిక సాధికార యాత్రలో భాగంగా కొత్తకోట జిల్లా పరిషత్ పాఠశాల లో జరుగుతున్న నాడు నేడు పనులను సుబ్బారెడ్డి పర్య వేక్షణ చేసిన సందర్భంలో శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విజ్ఞప్తి మేరకు క్రీడా ప్రాంగణం అభివృద్ధి కి రూ 5 లక్షలు, పాఠశాల ప్రహరీ గోడ తో పాటు మురుగు నీటి నిల్వ చేరకుండా కాలువ నిర్మాణం నిమిత్తం మరో రూ రెండు లక్షల జిల్లా పరిషత్ నిధుల ద్వారా మంజూరు చేయించారు. ఈ నిధులకు సంబంధిన ఆర్డర్ కాపీని స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె నాగేశ్వరావు కు అందించి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ పందల దేవా, డిసిఎం ఎస్ డైరెక్టర్ జి.సత్య దేవ్, ఎంపిటిసి సభ్యులు పూడి దేవ, వైసీపీ నాయకులు శీలం శంకరరావు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, డైరెక్టర్, నాయకులు,

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలోని దిబ్బిడిలో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను జెడ్‌పిటిసి దొండా రాంబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకు పట్టాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాషా, రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షులు సుంకర గాంధీ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని అమ్మపేట గ్రామంలో అర్హులైన 26 మందికి జగనన్న ఇళ్ల పట్టాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ వైసీపీ అధ్యక్షులు ఈగల పెదబాబు మాట్లాడుతూ పేదల సొంతింటి కల వైసీపీ ప్రభుత్వంలోనే నెర వేరిందని, అర్హులకు ఇళ్లను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నానిబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


పట్టాలు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు


ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పత్తి రమణ, మండల వైసీపీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇక్కడ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలన్ని అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'తప్పడు కేసులు పెడితే చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్:తప్పుడు అట్రాసిటీ కేసులు పెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరువాడ ఈశ్వరరావు అన్నారు. బుదవారం సాయంత్రం నర్సీపట్నంలోని 30 అడుగుల రోడ్డు లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళ అర్పించారు.నర్సీపట్నం డివిజన్ విజిలెన్స్ కమిటీ మెంబర్ చిట్ల చలపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, మార్తి అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఉచ్చులో పడి దళితులపై దళితులే తిరగబడి కొట్టుకునేలా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ లో ఆరు అట్రాసిటీ కేసులకి సంబంధించి ఫిర్యాదులు అందాయని తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో మొల్లేటి రమణ పాల్గొన్నారు.

ఆలయానికి పైలా ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మాడుగుల: అనుకూరు గ్రామంలో ఆలయానికి మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాద్‌రావు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని ఆవురువాడ గ్రామంలో పోతురాజు గుడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న పైలా ప్రసాద్ పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి పైలా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతలపాటి కల్యాణ చక్రవర్తి, వైస్ సర్పంచ్ తలారి వంశీ, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దార భీమరాజు, రొబ్బ రాజుబాబు, వంతల నూకరాజు, వనిపిరి రాజుబాబు, నమ్మి అర్జున పాల్గొన్నారు.


దర్శించుకుంటున్న పైలా ప్రసాదరావు


అవగాహన కల్పిస్తున్న వెంకటలక్ష్మి

రైతులకు అవగాహన

ప్రజాశక్తి -వడ్డాది:ఫర్టిగేషన్ ద్వారా ఎరువులు మొక్కల వేర్లకు చేరుతాయని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిని జి వెంకటలక్ష్మి తెలిపారు బుచ్చయ్యపేట మండలం లోపూడి సచివాలయం పరిధిలో ఫెర్టి గేషన్ పద్ధతిలో ఎరువులు వినియోగంపై డ్రిప్ రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ, తక్కువ సమయంలో ఎరువులు మొక్కలకు అందుతాయని, ఎరువులు వేసేందుకు అయ్యే ఖర్చు ఎకరాకు 3500 నుంచి 4000 వరకు తగ్గుతుందన్నారు.ఎరువులు సూర్య రశ్మికి ఆవిరి అయ్యే అవకాశం ఉండదని ఫర్టిగేషన్ ద్వారా నీరు, ఎరువులు ప్రతి మొక్కుకు సక్రమంగా అందడంతో మొక్కలు పెరుగుదల సమానంగా ఉంటుందన్నారు. రైతులు సాయం రఘునాథ్, దాసు, వివేకనంద చౌదరి, వేణు, విఎఎ బ్లెస్సీ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్:నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోలర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కె.సత్యదేవి, నర్సీపట్నం తహశీల్దార్ శ్రీరాములు, ఎంపిడిఒ జాన్‌లింకన్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు ఓటర్లను చైతన్య పరచాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అబ్బురపరచిన మాక్ డ్రిల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఎస్ఎంఎస్-2జోన్‌లో ఉక్కు యాజమాన్యం, సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు.ఉక్కు అధికారి ఎంఎస్. రావు మాట్లాడుతూ గ్యాస్, అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలో, ఎలా బయట పడాలో వివరించారు. మాక్ డ్రిల్‌లో మొబైల్ ఫైర్ ఫైటింగ్, వాటర్ కర్టెన్ సిస్టమ్‌ల వినియోగం, ప్రమాదంలో చిక్కుకున్నవారిని రెస్క్యూ చేయడం, ప్రథమ చికిత్స, ఇతరత్రా అంశాలపై విన్యాసాలు అబ్బురపరిచాయి కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎంఎస్. రావు, టి.పి.బే సైట్ ఇంచార్జి వీరకుమార్, సేఫ్టీ అధికారి రాజేష్, ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, పాల్గొన్నారు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-దేవరాపల్లి : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును బాధిత కుటుంబం పాపాన సత్యవతికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయులు బుధవారం తారువలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. పెందుర్తికి చెందిన పాపాన కోటేశ్వరరావు ప్రమాదవ శాత్తు మృతి చెందారు. కోటేశ్వరరావు భార్య పాపాన సత్యవతి తన దీనస్థితిని డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడుకు తెలియజేసి, ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. డిప్యూటీ సీఎం చొరవ తీసుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సత్యవతికి లక్షా 50 వేల రూపాయలు మంజురు చేయించారు. ఈ చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కురచా సూర్యనారాయణ, రాజబాబు పాల్గొన్నారు.

రవీంద్ర భారతి విద్యార్థికి యంగ్ జీనియస్ అవార్డు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వెల్లంకి రవీంద్రభారతి పాఠశాల ఆరో తరగతి విద్యార్థి కె.చరణ్‌వెంకట దుర్గసాయి ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో సచిర్ ఇండియాసంస్థ నిర్వహించి ప్రతిభా పోటీల్లో సత్తా చాటి జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి సర్ సివి.రామన్ యంగ్ జీనియస్ అవార్డుకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపల్ మంగలక్ష్మి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని ప్రిన్సిపల్‌తోపాటు వైస్‌ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.



చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

అనాథ విద్యార్థికి రూ.20 వేలు సాయం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని జట్టపురెడ్డి తుని పంచాయతీ పరిధి నర్సింగపల్లి గ్రామానికి చెందిన అనాథ విద్యార్థికి నర్సింగబిల్లి జెడ్‌పి హైస్కూల్ 2007 -2008 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు చదువు నిమిత్తం సహాయం అందజేశారు. పూర్వ విద్యార్థుల సమావేశం బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన అల్లారపు భారతి కుమారుడు మారిశెట్టి ప్రసాద్ అనాథ కావడంతో పూర్వ విద్యార్థులు ప్రసాద్‌ను దత్తత తీసుకున్నారు. గ్రామంలోని శ్రీనిజ స్కూలు చైర్మన్ కోన సోమునాయుడుకు రెండు సంవత్సరాలకు గాను రూ.20 వేలు ఫీజు చెల్లించారు.

మద్యం కంపెనీ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం సుందరయ్యపేట గ్రామంలో విశాఖ ట్రేడర్స్ మద్యం కంపెనీ ముందు బుధవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. కంపెనీ నుండి విడుదలవుతున్న వ్యర్థ జలాల వద్ద స్థానిక బోరుబావులు, భూగర్భ జలాలు కలుషితమవుతుందని ఆందోళన చేశారు. తక్షణం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు కంపెనీలోకి వెళ్లకుండా ఆందోళనకారులు అడ్డుకున్నారు.

జగనన్న కాలనీలో బినామీలకు ఇళ్లపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని చింతగట్ల గ్రామంలో బినామీ పేర్లతో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను స్థానిక సర్పంచ్ కేటాయిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కు వినతిపత్రాన్ని అందజేసి, వెంటనే దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి నాయకుడు చిన్నారావు, రమణ, సన్యాసిరావు, గణేశు రమేషు హరీష్ బంగారయ్య శివ గోవిందు పాల్గొన్నారు

బీచ్‌లో వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్‌లో తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల డీఫార్మా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బుధవారం స్వచ్ఛబీచ్ కార్యక్రమం చేపట్టారు.వ్యర్థాలను తొలగించారు సముద్ర జలాల పరిరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించారు ఫార్మా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై ఐద్వా పోరాటం

వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణలు



ములగాడలో పతకాన్ని ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి- ములగాడ : మహిళల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి ఐద్వా నిరంతరం పోరాటం చేస్తోందని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్.విమల అన్నారు. ఐద్వా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఐద్వా మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో జీవిఎంసి 58వ వార్డు గుల్లలపాలెంలో పి.పాలమ్మ , 59వార్డులో ఐద్వా రాష్ట్రకమిటీ సభ్యురాలు ఆర్.విమల, 62వవార్డు త్రినాధపురంలో బి.రాజేశ్వరి ఐద్వా పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్.విమల మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం 1931లో ఐద్వాగా రూపాంతరం చెందిందని, నాటినుంచి మహిళల హక్కులు, సమస్యలపై పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. ఐద్వాను బలోపేతం చేయడం, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బిజెపిని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఐద్వా మల్కాపురం జోన్ అధ్యక్షురాలు బి.మమత, సభ్యులు పి.వర లక్ష్మి, కె.అన్నపూర్ణ, బి.లక్ష్మి, గురులక్ష్మి, అరుణ, ఈశ్వరమ్మ, కృష్ణవేణి, ఎస్ దేవి, కె.లక్ష్మి, సింహాచలం, రమణమ్మ, సీత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో ఐద్వా పతాకావిష్కరణ

అనకాపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అఖిలభారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) పతాకా విష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి మాట్లాడుతూ మహిళలు పనిచేస్తున్నారని, అయినప్పటికీ వేతనాలు మహిళలకు చాలా తక్కువగా చెల్లిస్తున్నారని తెలిపారు. మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం కారణంగా 12 గంటలు పనిచేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న మహిళలకు ప్రసూతి సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏమీ అమలు చేయడం లేదన్నారు. మహిళా సంఘం నేతలు నాగమణి, తోట పార్వతి, రాసి అడివమ్మ, పి.లక్ష్మి, పి రమాదేవి, పి మంగ, బి.ధనలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరలక్ష్మి

యువతకు సామాజిక బాధ్యత అవసరం



మాట్లాడుతున్న హెచ్ఎం శేషుకుమారి

ప్రజాశక్తి- మధురవాడ : యువత ఏ రంగంలో ఉన్నా సామాజిక బాధ్యత మరువరాదని, సేవా కార్యక్రమాలతో మానవ సంబంధాల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలని ఎంవిపిఎంసి హైస్కూల్ హెచ్ఎం ఎవిడి. శేషుకుమారి అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో స్థానిక జీవిఎంసి ఎండిఎంసి ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గీతం విద్యార్థులు పాఠశాలలను దత్తత తీసుకుని, నిరంతర సేవా కార్యక్రమాలతో అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్నారని కొనియాడారు. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. 100 మందికి పైగా గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మూడు రోజుల సేవాశిబిరంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. బాలికలకు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో గీతం ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.కె.రఘు, డాక్టర్ జె.శ్రీనివాసరావు, బి.కవిత పాల్గొన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన



గొలుగొండలో నిరసన తెలియజేస్తున్న స్టాఫ్‌నర్సులు

ప్రజాశక్తి- గొలుగొండ: ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలంటూ బుధవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పిహెచ్‌సి వద్ద కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ గ్రాడ్యుయేట్ కమిటీ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలపై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి యూనియన్ తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రోలుగుంట:కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలంటూ బుధవారం రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి యూనియన్ పరంగా తెలియజేసినప్పటికీ స్పందించ లేదన్నారు. తక్షణం తమను రెగ్యులర్ నోటిఫికేషన్ జారీ చేయాలని, అదే విధంగా ఒకే క్యాడర్ వేతనం అమలు చేయాలని సంఘం సభ్యులు ఇ.నాగమణి, ఆర్.సోమమణి, డి.వరలక్ష్మీలు కోరారు. అనంతరం పీహెచ్‌సి వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొంతలం గ్రామంలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అవగాహన కల్పించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి ఈ మిషన్ల పనితీరును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటింగ్ యంత్రాలపై అవగాహన ఉండాలని, 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రామచంద్రుడు, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి బాబ్జి, సెక్రెటరీ కేటరింగ్ శివాజీ, జనరల్ సెక్రెటరీ అలమండ వరహాలరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఓటింగ్ మిషన్లపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

న్యాయ సాధన సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత చెల్లుబోయిన

ప్రజాశక్తి -గాజువాక : ఈనెల 16న స్టీల్‌ప్లాంట్ తృష్ణ మైదానంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న న్యాయసాధన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ నేత చెల్లిబోయిన నాయుడు అన్నారు. బుధవారం సమతానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి మద్దతుగా నిర్వహించే సభకు ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల,మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొంటారని, ఈ సభకు ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు, కాంగ్రెస్ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, ఎపికి ప్రత్యేకహోదా సాకారమౌతుందన్నారు.కార్యక్రమంలో పల్లా అచ్చిబాబు, రాజు, నెల్లి అప్పలరాజు, గొంప రామారావు పాల్గొన్నారు.

పాత తహశీల్దార్ కార్యాలయం పరిశీలన

ప్రజాశక్తి- పెందుర్తి : ఎన్నికల ఏర్పాట్లుపై రిటర్నింగ్ అధికారి శేషశైలజ పరిశీలించారు బుధవారం గతంలో నామినేషన్లు స్వీకరించిన పాత తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి, అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. భవనం మరమ్మతులకు ఎంత బడ్జెట్ అవుతుందో అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

వేతన కార్యదర్శి కాసుబాబుకు సత్కారం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని చీమలపల్లి విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం వేతన కార్యదర్శి అమలకంటి అప్పారావు కాసుబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ గ్రామ పాల కేంద్రం ఆవరణలో బుధవారం ఘనంగా సత్కరించారు. 197 మంది పాల ఉత్పత్తిదారులకు బెడ్ షీట్లు కాసుబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు మజ్జి రమణ, పాల ఉత్పత్తిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాల అందజేత

ప్రజాశక్తి అరిలోవ : అరిలోవ కాలనీ, సచివాలయం వద్ద బుధవారం 1800 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ అందజేశారు. సొంతింటి కలను సాకారం చేయడమే సిఎం జగన్ లక్ష్యమని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని కోరారు.

చోడవరం : మండలం గోవాడ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి, రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్మయ్యమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ వైవి.సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైసిపి మండల అధ్యక్షులు వెంకటరావు, పిఎసిఎస్ చైర్మన్ బీర సత్యారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ అభయహస్తం' ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ అభయ హస్తం పథకం కింద పేద కుటుంబాలకు ప్రతినెలా రూ.ఐదు వేలు ఇవ్వనున్నట్లు స్థానిక నేతలు వెల్లడించారు. బుధవారం స్థానిక జంక్షన్ లో పార్టీ నాయకులు గొంప గోవిందరావు, గాదం మహేష్, పల్ల వెంకటరావు, కదిరి జగన్నాథం, ఎవి వర్మ (హాసిని వర్మ) తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అవంతి కాలేజీకి 'నాక్ ఏప్లస్' గ్రేడ్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో 'నాక్ ఎ ప్లస్' గ్రేడ్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్ర శేఖర్ తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి కళాశాలకు ఈ గుర్తింపు వచ్చిందన్నారు. అధ్యాపకులు,సిబ్బంది సమిష్టి కృషి కారణమన్నారు.

22వ వార్డులో రూ.11.5 కోట్ల అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 22వ వార్డు పరిధిలో మూడేళ్లలో రూ.11.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తెలిపారు. రికార్డు స్థాయిలో బుధవారం రూ.కోట్ల పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. కళాభారతి సమీపంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్ష కార్పొరేటర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో రూ.11.5 కోట్ల పనులు జరగడం విశేషమన్నారు. ఈ సమావేశంలో జనసేన వార్డు అధ్యక్షుడు పోతు వెంకట ప్రసాద్, బిజెపి వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్, పీతల మధుసూదనరావు, పెసల శ్రీను, శేఖర్, పండు, వసల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16న సినర్జీస్‌లో జాబ్‌మేళా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీలో ఈ నెల 16వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లమో మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ, ఐటిఐ ఫిట్టర్, టర్నర్, మెకానిస్ట్, ఎలక్ట్రికల్, డీజిల్ మెకానిక్, బిటెక్, ఎంటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ పూర్తి చేసిన ఆసక్తి గల యువతీ యువకులు సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్‌లో శనివారం 9 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.12 వేలు నుంచి రూ.20 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అప్‌డేటెడ్ రెజ్యూమ్, సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9966965502 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సెమీ కండక్టర్ యూనిట్లతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సెమీ కండక్టర్ యూనిట్ల ఏర్పాటు ద్వారా దేశంలో ఉద్యోగావకాశాలు పెరగడమే కాక, సాంకేతికంగా ఎంతో ముందుకెళ్ళి దేశ సామర్థ్యాన్ని ఇతరదేశాలతో పంచుకునే వీలుందని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు పేర్కొన్నారు. ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యాన సెమీకండక్టర్లపై ప్రత్యేక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దేశంలో మూడు చోట్ల ప్రధానమంత్రి బుధవారం సెమీకండక్టర్ యూనిట్ల శంఖుస్థాపన చేసిన సందర్భంగా వాటి అవసరంపై ప్రాంతీయ కేంద్ర ఆవరణలో అతిథి ఉపన్యాసం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ, వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి చొరవతో సెమీ కండక్టర్ యూనిట్లు ఏర్పాటవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ భౌతికశాస్త్ర సహ ఆచార్యులు డాక్టర్ సిహెచ్.రవిశంకర్‌కుమార్, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఇగ్నో సిబ్బంది పాల్గొన్నారు.

గేట్ వే ఆఫ్ వైజాగ్ పోర్టు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోర్టులో సుమారు రూ.30 లక్షలతో ఏర్పాటుచేసిన గేట్ వే ఆఫ్ వైజాగ్ పోర్టు పనులను బుధవారం చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు కాన్వెంట్ కూడలి వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోర్టు అభివృద్ధిలో భాగస్వాములైన స్థానిక అధికార యంత్రాంగం, నగర పోలీసులను ప్రశంసించారు. పోర్టు రోడ్లు నగరంతో అనుసంధానమయ్యే ప్రదేశాలలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయడంతో పాటు విద్యుదీకరణ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ స్థానిక అధికార యంత్రాంగంతో కలిసి నగరాభివృద్ధికి ముఖ్యంగా రోడ్లు, ఫుట్ పాత్‌లు, డివైడర్లు అభివృద్ధికి కృషి చేస్తోందని పోర్టు కార్యదర్శి టి వేణుగోపాల్ తెలిపారు. జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో పోర్టు చేస్తున్న కృషిని ప్రశంసించారు. బిటి రోడ్ల నిర్మాణం, పోర్టు ఉత్తర, పశ్చిమ ప్రాంతంలో విద్యుత్ వెలుగులు ప్రసరించేలా ఎల్ఇడి ఎల్ఈడీ స్ట్రిప్‌లను ఏర్పాటు చేయడంపై పోర్టు యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిటి పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, దుర్గేష్ కుమార్ దూబె, పిఎస్ఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయ సలహా మండలి సభ్యునిగా జీలకర్ర నాగేంద్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం విమానాశ్రయం సలహా మండలి సభ్యునిగా జీలకర్ర నాగేంద్రను నియమిస్తూ విశాఖపట్నం విమానాశ్రయం డైరెక్టర్ యస్.రాజారెడ్డి ఆదేశాలు జారీచేశారు. విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సిఫార్సు మేరకు తనను విమానాశ్రయం సలహా మండలి సభ్యునిగా నియమించినట్టు జీలకర్ర నాగేంద్ర తెలిపారు. విమానాశ్రయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డికి, మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

దేశం గర్వించదగ్గ కవయిత్రి మొల్ల



కవయిత్రి మొల్లకు నివాళులర్పిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపట్టన్ శెట్టి తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం


విశాఖ కలెక్టరేట్ : కవయిత్రి ఆతుకూరి మొల్ల దేశం గర్వించదగ్గ మహిళ అని, భావితరాలకు స్ఫూర్తిప్రదాత అని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అన్నారు. తెలుగు భాషలో మొట్ట మొదట కవయిత్రిగా రామాయణ కావ్యాన్ని ఆమె రాశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ విసి హాలులో కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, బిసి సంక్షేమ అధికారి కె.శ్రీదేవి ఇతర అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొల్ల జీవిత విశేషాలను డిఆర్వో, బిసి సంక్షేమ అధికారి వివరించారు. సరళమైన తెలుగు పదాలతో, వాడుక భాషలో రామాయణ కావ్యం రచించి తెలుగు భాషకు వన్నెతెచ్చిన మహనీయులు అని కొనియాడారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు డి.చిరంజీవి రావు, వివిఎస్.మూర్తి, వి.రవీంద్రబాబు, వైవి.రమణయ్య, కె.కనకరావు, రామలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబను స్ఫూర్తిగా తీసుకోవాలి

అనకాపల్లి : జ్ఞాన సముపార్జన కొందరికే సొంతం కాదని, కృషి పట్టుదల ఏకాగ్రత వుంటే ఎవరైనా జ్ఞానాన్ని పొందవచ్చుని కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి తెలిపారు. ప్రాచీన తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరు కార్యాలయంలో మొల్లమాంబ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రాజేశ్వరి, డిఆర్ఒ బి.దయానిధి, కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎ.జగదీశ్వరరావు, ఎమ్.సత్యనారాయణ, కె.శేషగిరిరావు, బి.నరసింహం, కె.శ్రీనివాసరావు, డి.అప్పలరాజు, ఎమ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హుండాయ్ క్రెటా ఎన్‌లైన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నూతన క్రెటా ఎన్ లైన్ వాహనాన్ని లక్ష్మీ హుండాయ్ సంస్థ విశాఖ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. గాజువాక లక్ష్మీ హుండాయ్ షోరూమ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిహెచ్‌పివి శాఖ మేనేజర్ హచిట్ కుమార్ పాల్గొని నూతన క్రెటా ఎన్ లైన్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుండాయ్ సంస్థలో క్రెటా వాహనం ఇప్పటికే ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని నూతన హుండాయ్ క్రెటా వాహనంలో మరిన్ని అధునాతన సౌకర్యాలు పొందుపరిచారని తెలిపారు. సంస్థ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ, తమ సంస్థను ఆదరిస్తున్న కస్టమర్లకు అత్యుత్తమ సర్వీస్ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ హుండాయ్ క్రెటా ఎన్ లైన్ వాహనం మాన్యువల్ డిసిటి ఆటోమేటిక్ వ్యవస్థ కలిగి పెట్రోల్‌లో మాత్రమే అందుబాటులో ఉందని వివరించారు. ఎస్‌యువి విభాగానికి చెందిన వాహనం 4 సిలిండర్స్, 16 వల్వేస్ కలిగి ఉంటుందని, భద్రత పరంగా లెవెల్ 2 ఎడిఎఎస్ సదుపాయం కలిగి ఆరు స్టాండర్డ్ ఎయిర్ బ్యాగ్‌లతో తయారుచేసినట్లు తెలిపారు. విశాలమైన స్పేస్ కలిగి అధునాతన పవర్ టు కంట్రోల్ వ్యవస్థ ఈ కార్లో ఉందన్నారు. కారు ప్రారంభ ధర రూ.16.82 లక్షలని తెలిపారు. అనంతరం కారు మొదటి కొనుగోలుదారులైన పి.పల్లవికి ముఖ్య అతిథి ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ హుండాయ్ జనరల్ మేనేజర్ (అకౌంట్స్ అండ్ ఫైనాన్స్) జి.కిషోర్ కుమార్, గాజువాక బ్రాంచ్ మేనేజర్ సునీల్ కుమార్, సంస్థ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



మొదటి కొనుగోలుదారు పల్లవికి కారు తాళం అందిస్తున్న అతిథి

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి నేటికీ అందని వేతనాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి నేటికీ జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా యూనియన్ నాయకులు వి.వీరబ్రహ్మం, గోపీనాథ్ ఆవేదన వ్యక్తంచేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో కేంద్ర ప్రభుత్వం నుంచి 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నిధులు 60 శాతం మొత్తం కలిపి సిబ్బందికి జీతాలతో పాటు అన్ని సౌకర్యాలకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా ఆలస్యంగా జీతాలు ఇవ్వడం వల్ల సరుకుల కొనుగోలు, అవసరాలు తీర్చుకునేందుకు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జీతం అందక ఇంటి అద్దె కట్టడం ఆలస్యమవుతుంటే ఇళ్లను ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. స్కూలు ఫీజులు కట్టేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న వైద్యారోగ్య రాష్ట్ర, జిల్లా అధికారులు వెంటనే స్పందించి సిబ్బంది జీతాలు వెంటనే చెల్లించేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో సుమారుగా 22 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, విశాఖపట్నం జిల్లాలో 1500 పైగా 186 రకాల కేడర్లలో పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో కొంతమంది అవుట్ సోర్సింగ్, మరికొంతమంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని వివరించారు. చాలీచాలని జీతాన్ని కూడా ఆలస్యం ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదనవ్యక్తంచేశారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు స్పందన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఓటరు నమోదు, చిరునామా మార్పు, గుర్తింపు కార్డు పొందుట, పోలింగ్ స్టేషన్ వివరాలు తదితర సందేహాలను నివృత్తి చేసే నిమిత్తం విశాఖపట్టణం కలెక్టరేట్ నుంచి బుధవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ - ఓటరు హెల్ప్ లైన్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. తొలి రోజు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 19 మంది ఫోన్లు చేసి వారి సమస్యలను తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, కలెక్టరేట్ ఎవో, ఎన్నికల విభాగం అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఫోన్ ఇన్ ద్వారా స్వయంగా ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను విని కొన్నింటికి తక్షణ పరిష్కారం చూపారు. గురువారం మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ - ఓటరు హెల్ప్ లైన్ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు 0891 - 2590100 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.

పిఎం సురాజ్ ద్వారా రుణాల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పిఎం సురాజ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో రూ.2.17 కోట్ల రుణాలను 51 మంది లబ్ధిదారులకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పంపిణీ చేశారు. 30 మందికి ఆయుష్మాన్ కార్డులు, 32 మందికి పిపిఇ కిట్లను అందజేశారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన పిఎం సురాజ్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి వర్చ్యువల్‌గా బుధవారం ప్రారంభించి, లబ్ధిదారులతో ముచ్చటించారు. విశాఖ నుంచి జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, సామాజిక న్యాయం,సాధికారత మంత్రిత్వ శాఖ లైజన్ ఆఫీసర్ పికె.జాన్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు పాల్గొన్నారు.

పెండింగ్ లేకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఎటువంటి పెండింగ్ ఫారాలు లేకుండా తగిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. పెండింగ్ దరఖాస్తులు, ఎపిక్ కార్డులు తయారీ, ముద్రణ, డెలివరీ, ఎన్నికలపై పత్రికలలో వచ్చిన వార్తలపై తీసుకున్న చర్యలు, ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, ఎన్నికల నియమావళి ప్రకారం పాటించాల్సిన నిబంధనలు వగైరా సమాచారంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విశాఖ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, అదనపు సిపి ఫకీరప్ప, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 20,635 ఫారం 6, 7, 8 పెండింగ్ ఉన్నాయని, వాటిని పరిశీలించి పూర్తిచేస్తామన్నారు. 5 లక్షల ఎపిక్ కార్డులకు గాను 4.8 లక్షల కార్డులు జిల్లాకు అందాయని, పోస్టల్ ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టామని తెలిపారు.

15న కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ వార్షిక సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని జాతీయ స్థాయి శిక్షణా సెషన్‌తో పాటు వార్షిక జాతీయ సమావేశం ఈ నెల 15న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే తెలిపారు. దసపల్లా హోటల్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, వినియోగదారుల చట్టంపై అవగాహన, శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశంలోను, రాష్ట్రాల్లోను అనేక చట్టాలు ఉన్నప్పటికీ వినియోగదారులకు ఇప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. జాతీయ స్థాయిలో వినియోగదారుల హక్కులను కాపాడుతూ, చట్టపరంగా వారికి జరుగుతున్న అన్యాయాలను, సమస్యలపై పరిష్కారానికి కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ మురళీనాథ్, కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

విజన్ విశాఖే ధ్యేయం : వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విజన్ విశాఖే ధ్యేయంగా నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి సంకల్పమని రాజ్యసభ సభ్యులు, ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. జివిఎంసి పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం ఆయన మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, సుమారు రూ.147 కోట్ల వ్యయంతో 423 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసుపల్లి గణేష్ కుమార్, కెకె.రాజు, జియ్యాని శ్రీధర్, కట్టమూరు సతీష్ తదితరులు పాల్గొన్నారు.